(9) 2-3-2000 ఆంధ్రప్రభ

# 'కాశ్మీర్ సమస్య'కు పరిష్కారం వద్దా?

**ఆక్రమిత కాశ్మీర్ నుంచి వైదొలగే వరకు పాకిస్తాన్‌తో మాట్లాడేదిలేదని ప్రధాని స్పష్టం చేస్తూ ఉండడం ఎంతవరకు అర్థవంతం?**

**కాశ్మీర్ విషయంలో తమతమ మౌలికవాదాలను ఉభయదేశాలు వదులుకోవడానికి ఇష్టపడితే ఇక మాటల అవసరం ఏముంటుంది?**

**అదీగాక, మాట్లాడరాదన్న విపరీతవైఖరి వల్ల అంతిమంగా నష్టపోయేది కాశ్మీరీలు కారా?**



కె.బాలగోపాల్

ఈ మధ్య భారత ప్రధాని వాజ్‌పేయి 'పాకిస్తాన్‌తో మాట్లాడేది లేదం'టూ భీష్మించుకు కూర్చోవడం ఆందోళనే కాక ఆశ్చర్యం కూడా కలిగించే విషయం. పాకిస్తానీ సైనిక పాలకులకు లెజిటిమెసీ కల్పించడం ఇష్టంలేక ఆ వైఖరి అవలంబిస్తున్నారని పత్రికలు వ్యాఖ్యానిస్తున్నాయి కానీ ఆయన అంటున్నది అది కాదు. సైనిక పాలకులు ప్రజా ప్రతినిధులు కారు కాబట్టి వారితో మాట్లాడి ప్రయోజనం లేదంటే ఆ వాదన తప్పయినా ఒప్పయినా అందులో ఒక తర్కం ఉంది.


కానీ మన ప్రధాని అంటున్నది అది కాదు. పాకిస్తాన్ 'ఆక్రమిత కాశ్మీర్' నుండి వైదొలగి మనకు అప్పగించే దాకా మాట్లాడేది లేదని అంటున్నారు. దీని అర్థం మాట్లాడడానికి నిరాకరించడం తప్ప వేరే ఏమీకాదని ఆయనకీ తెలుసును, అందరికీ తెలుసును. ఇది నిజానికి యాభై ఏళ్ళుగా ఆర్. ఎస్. ఎస్. అనుసరిస్తున్న వాదన. బాల్ థాకరే దీనిని ఇంకొంచెం ముందుకు లాగి 'ఆక్రమిత కాశ్మీర్' ను మనకు అప్పగించే దాకా పాకిస్తాన్‌తో క్రికెట్ ఆడొద్దనీ సాంస్కృతిక సాహిత్య రంగాలలో ఇచ్చిపుచ్చుకోవడం బంద్ చేయాలనీ అంటున్నారు. ఇప్పుడు అటల్ బిహారీ వాజ్‌పేయి అదే పాట పాడుతున్నారు.

ఈ మహా భాగ్యానికి ఒక సంవత్సరం క్రితం లాహోర్‌కు పోయిందెందుకు? 'ఆక్రమిత' కాశ్మీర్‌ను పాకిస్తాన్ ఇవ్వదనీ దానిని మనకు ఇవ్వడానికి మనదిగా పాకిస్తాన్ దానిని భావించడంలేదనీ అప్పుడు తెలీదా ? నిజానికి పాకిస్తాన్‌లో ఉన్న కాశ్మీర్‌ను మనం 'ఆక్రమిత కాశ్మీర్' అని పిలిచినట్టే భారత్‌లో ఉన్న కాశ్మీర్‌ను పాకిస్తాన్ 'హెల్డ్ కాశ్మీర్' అంటుంది. అంటే మనం గుప్పిట్లో ఉంచుకున్న కాశ్మీర్ అని అర్థం. దానిని విడిచిపెట్టే వరకూ భారత్‌తో మాట్లాడవద్దని పాకిస్తాన్ ప్రభుత్వాన్ని హెచ్చరించే సంస్థలు, ఉద్యమాలు ఆ దేశంలోనూ ఉన్నాయి.

సమస్యలున్నాయి కాబట్టే మాట్లాడుకోవలసి ఉంది కాబట్టి 'సమస్యే లేదని నువ్వు గుర్తిస్తేనే నీతో మాట్లాడతాను' అనే వైఖరి బొత్తిగా అర్థంలేని వైఖరి. ఈ రెండు దేశాలలోనూ ఉన్మాదులు ఏమన్నప్పటికీ ఈ వ్యావహారిక సత్యాన్ని ఎవరు అధికారంలో ఉన్నా గుర్తించడం జరుగుతున్నది. కాబట్టే ఏదో ఒక మేరకు ఈ రెండు దేశాల మధ్య సంభాషణ ఒకసారి కాకపోతే ఒకసారి జరుగుతున్నది. ఇప్పుడు బహుశా మొట్టమొదటిసారిగా భారత ప్రభుత్వ ప్రధాన మంత్రి కాశ్మీర్ విషయంలోనూ పాకిస్తాన్ తన వైఖరిని మొత్తంగా విడిచిపెడితేనే వారితో మాట్లాడతామంటున్నారు. ఇంక అప్పుడు మాట్లాడుకోవడానికి ఏముంటుంది? ఎగుమతి దిగుమతి సుంకాల గురించి మాట్లాడుకుంటారా? నిజానికి పాకిస్తాన్ అయినా మనమైనా కాశ్మీర్ విషయంలో మౌలిక వైఖరినే విడిచిపెట్టడానికి సిద్ధపడినట్టయితే ఇంక మాట్లాడలేకపోవడానికి కారణం మాత్రం ఏముంటుంది? నువ్వు సమస్యేలేదని ఒప్పుకుంటే నేను పరిష్కారం చెప్తానన్నది 'దేశ భక్తి' కావచ్చును కానీ అది వట్టి తెలివితక్కువ వైఖరి.

మళ్ళీ మళ్ళీ చెప్పవలసిన విషయం ఏమిటంటే ఈ వైఖరి వల్ల నష్టపోయేది కాశ్మీరీలు. ఆ లోయలోనూ, దానిని ఆనుకుని ఉన్న జమ్మూ ప్రాంతపు పీర్ పంజల్ కొండ చరియలలోనూ నిత్యం సాగుతున్న మారణకాండ ఎప్పటికైనా ఆగాలంటే భారత —పాకిస్తాన్‌లు పట్టుదల వీడి మాట్లాడుకోవడానికి సిద్ధపడాలి. కాశ్మీరీలతో మాట్లాడడానికి కూడా సిద్ధపడాలి. కష్టసాధ్యంగా కనిపించిన ఈ ఆశ రాను రాను పగటికలగా కనిపిస్తున్నది. అది పగటికలేనని చెప్పడం కోసమే కాబోలు మన ప్రధాని ఈ ప్రకటన పదే పదే చేస్తున్నారు.

మన పాలకులు పాకిస్తాన్‌తో మాట్లాడరు. పోనీ కాశ్మీరీల మాటయినా వింటారా? రాజ్యాంగాన్ని సమీక్షిస్తామని



వాళ్ళు అంటున్నారంటే వారి దృష్టిలో అగ్రభాగాన ఉన్న వాటిలో ఆర్టికల్ 370 ఒకటని వేరే ఎవ్వరికీ తెలియకున్నా కాశ్మీరీలకు తెలుసును. కాశ్మీరీలు ఎప్పటికయినా భారత్‌లో కొనసాగడానికి ఇష్టపడడం అంటూ జరిగితే అది ఆర్టికల్ 370 ప్రాతిపదికనే కాగలదని కాశ్మీర్‌తో ఏ కొంచెం పరిచయం ఉన్న వారికైనా తెలుసును.

నిజానికి ఆర్టికల్ 370 ఇప్పటికే తన సారాన్ని కోల్పోయింది. నామమాత్రంగా అది రాజ్యాంగంలో ఉంది. అదెలా జరిగిందన్న విషయాన్ని వివరించి చెప్పడానికిది సందర్భం కాదు. జరిగిందనేది మాత్రం సత్యం. ఇప్పుడున్న డొల్లను కొనసాగించడమా లేదా అనేది సమస్య కాదు. ఆర్టికల్ 370 ని నిజమైన అర్థంలో పునరుద్ధరించడం 'కాశ్మీర్ సమస్య' పరిష్కారానికి కనీస అవసరం. అందుకు పూర్తిగా విరుద్ధంగా ప్రకటనలిస్తూ మరొకవైపు పాకిస్తాన్‌తో కూడా మాట్లాడడానికి నిరాకరిస్తున్న మన బి. జె. పి. పాలకులు 'కాశ్మీర్ సమస్య'కు ఏ పరిష్కారాన్ని ఆశిస్తున్నారో ఊహించడం కష్టం కాదు. ఇప్పటికే సైనిక బలగాల నిలయంగా ఉన్న కాశ్మీర్‌ను మరింతగా సైన్యానికీ, కేంద్ర యుద్ధ మంత్రి జార్జి ఫెర్నాండెజ్‌కూ (ఇన్నాళ్ళూ మనకు రక్షణ మంత్రులున్నారు కానీ ఫెర్నాండెజ్ రాకతో ఒక యుద్ధ మంత్రిని పొందాము) విడిచి పెట్టడం వారి మనసులో ఉన్న పరిష్కారం. ఇది పని చేయకపోగా విపరీతమైన రక్తపాతానికి దారి తీస్తుందని కాశ్మీర్ పరిస్థితులతో ఏ కొంచెం పరిచయం ఉన్న వారయినా చెప్పగలరు. కానీ పారేది కాశ్మీరీ ముసల్మాన్‌లరక్తమైనప్పుడు మన వాళ్ళెందుకు బాధపడతారు? నిజమే, వారితోపాటు సైనిక జవాన్లు కూడా చాలా మంది చనిపోతారు. కానీ వారికి అమరగీతాలు పాడొచ్చు. వారి బలిదానాన్ని శ్లాఘించవచ్చు. శౌర్యచక్ర వంటి మరణానంతరం బిరుదులియ్యవచ్చు.

వేరే ఎవరి సలహాలు వినడానికి సిద్ధంగా లేకున్నా బి.జె.పి. పాలకులు కనీసం తమకు సన్నిహితుడయిన ఫరూఖ్ అబ్దుల్లా సలహాలయినా వినవచ్చును కదా? అతనికి తన బాధ్యతల పట్ల కానీ, కాశ్మీర్ ప్రజల భవితవ్యం పట్ల కానీ పెద్దగా పట్టింపు ఉన్న దాఖలాలేవీ లేవు. ఒక రోజు శ్రీనగర్‌లో ఉంటే రెండవ రోజు లండన్ లోనో, ప్యారిస్ లోనో ఉండే విలాసజీవి. తండ్రి వారసత్వంగా ఆయనకి రాజకీయ ప్రాముఖ్యం సంక్రమించిందే తప్ప సొంత అర్హత లేశమంతైనా లేదు.

అటువంటి వ్యక్తి సహితం స్వాతంత్ర్యం కాకపోతే కనీసం స్వయం ప్రతిపత్తి కాశ్మీరీలకు అత్యంత ప్రీతిపాత్రమైనదని గ్రహించారు. 1952లో ఆయన తండ్రి షేక్ అబ్దుల్లా అప్పటి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూతో చేసుకున్న 'ఢిల్లీ ఒప్పందం' ఈ కనీస స్వయం ప్రతిపత్తిని నిర్వచించింది. దానిని పూర్తిగా పునరుద్ధరించినా కాశ్మీరీలలో మెజారిటీ సంతృప్తి చెంది స్వాతంత్ర్య పోరాటం వదులుకుంటారని చెప్పగలమో లేదో కానీ రక్తపాతం ద్వారా కాకుండా కొంచెమైనా నాగరికంగా కాశ్మీరీలను గెలుచుకోదలచుకుంటే 1952 ఢిల్లీ ఒప్పందాన్ని సంపూర్ణంగానూ, చిత్తశుద్ధితోనూ పునరుద్ధరించి అమలు చేయడం ఒక్కటే మార్గమని అందరికీ తెలుసును. ఫరూఖ్ అబ్దుల్లా దానిని తన ఎన్నికల హామీ చేసుకున్నారు. గెలిచిన తరువాత అందుకోసం ఒక కమిటీని వేశారు.

ఇప్పుడు ఆ కమిటీ నిర్దిష్టమైన ప్రతిపాదనలతో తన నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చింది. రాష్ట్రం దానిని కేంద్రానికి పంపించింది. ఫరూఖ్ అబ్దుల్లా వంటి మిత్రుడు —కాశ్మీర్ ఎప్పటికైనా భారత్‌లో భాగమేనని గట్టిగా నమ్మే 'దేశభక్తుడు' —సహితం కాశ్మీర్‌ను 'కాపాడుకోవడానికి' ఇది తప్ప వేరే మార్గం లేదని గుర్తించడం నుంచయినా మన హిందూత్వవాద పాలకులు 'కాశ్మీర్ సమస్య' కు సంబంధించిన ఒక ప్రాథమిక సత్యాన్ని గుర్తించగలిగితే అది అందరికీ శ్రేయస్కరం.

కానీ మన పాలకుల ఆలోచనలిప్పుడు ఆ దిశలోలేవు. ఎటువంటి 'బలహీనతలు' ప్రదర్శించని శక్తిమంతులుగా కనిపించడం ఇప్పుడు ముఖ్యం. ఎవరిని సంతృప్తిపరచడానికి ? హిందూత్వవాదుల అధినేత ఖందహార్ ఘటన సందర్భంగా 'మనం పిరికివాళ్ళం' అన్నారు కదా —ఆయనను సంతృప్తిపరచడం కోసం ఆయనను అంటే ఆ వ్యక్తినని కాదు. ఆ ఆలోచనా సరళిని. చుట్టుపక్కల దేశాలు జడుసుకునే బలవత్తర దేశంగా భారత్‌ను భావించుకోవాలి. ఆ భావనను వాస్తవం చేయాలి. విమాన ప్రయాణీకుల ప్రాణాలు కాపాడాలనుకోవడం, కాశ్మీరీల మనోభావాలను అర్థం చేసుకోవాలనుకోవడం, ప్రజలేదయినా కోరుకుంటే కనీసం కొంచమైనా ఇచ్చి వారిని మంచి చేసుకోవాలనుకోవడం, సామరస్యం కోసం అవసరమయితే ఒక్కడుగు వెనక్కి వేయడం —ఈ పిరికిమందు మన పాలకులకు గిట్టదు. అవి బలవంతులకు తగని ఆలోచనలు. చేతకాని వాళ్ళు అటువంటి ఆలోచనలు చేస్తారు కానీ అఖండ భారత్‌ను ప్రచండ శక్తిగా మార్చడం తమ దీర్ఘకాల ఆదర్శంగా కలవాళ్ళు చేయరు.

ఒక్కొక్క అడుగే యుద్ధం వైపు పోతున్నామంటే అది అనవసరమైన భయమని కానీ, అతిశయోక్తి అనికానీ అనిపించవచ్చు. పూర్తి స్థాయిలో యుద్ధం చేయడానికి ఈ రెండు దేశాలూ కూడా ఈ రోజు వెనుకాడవచ్చు. కానీ మన పాలకులు పాకిస్తాన్ విషయంలోనే కాక కాశ్మీర్ విషయంలో కూడా అనుసరిస్తున్న వైఖరికి వేరే పర్యవసానం ఏదీ ఉండజాలదు. ఇక్కడ 'కాశ్మీర్ విషయంలో' అనేది చాలా ముఖ్యం. కాశ్మీర్ ప్రజల సహాయ సహకారాలు తనకు లభిస్తే భారత్ మీద యుద్ధం విజయవంతంగా చేయగలనన్న ధీమా పాకిస్తాన్‌కు మొదటి నుండి ఉంది. ఇప్పటిదాకా ఆ సహకారం పాకిస్తాన్‌కు పూర్తిగా అందలేదు. ఎందుకంటే సగటు కాశ్మీరీలు భారత్‌లో కానీ, పాకిస్తాన్‌లో కానీ ఉండడానికి ఇష్టపడరు. కానీ ఆర్టికల్ 370 — ఇంకా సరిగ్గా చెప్పాలంటే 1952 ఒప్పందం విషయంలో ఇదే తిరస్కార వైఖరి మన పాలకులు కనబరుస్తూ ఉంటే వాళ్ళెంతగా పాకిస్తాన్‌తో యుద్ధానికి ఉబలాటపడుతున్నారో పాకిస్తాన్ కూడా అంతగా సై అనడానికి సిద్ధపడుతుంది. ఆ వాతావరణం 'కార్గిల్ యుద్ధ' మప్పటి నుండి కనిపిస్తున్నది. దానిని పెంచే దిశగానే తప్ప తగ్గించే దిశగా మన పాలకుల ధోరణి లేకపోవడం చాలా ఆందోళనకరం.